క్లుప్తంగా

ఉరుకుంద ఆలయానికి రూ.50 వేలు విరాళం



దాతల నుంచి విరాళం స్వీకరిస్తున్న ఆలయ అధికారులు

మంత్రాలయం : ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం సి.బెళగల్ మండల కేంద్రానికి చెందిన మంగమ్మ, గ్రామస్తులు రూ.50,640ను విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలకు స్వామి దర్శనం, శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. బాండు, పూలమాలతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ కమారయ్య, ఆలయ సిబ్బంది శివ, మల్లికార్జున, విట్టల్, రమేష్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలను పాటిస్తే వ్యాధిని తరిమికొట్టవచ్చని హనుమాన్ నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్లు వినోద్ కుమార్, అనిల్ సాగర్ తెలిపారు. సోమవారం అరుంజ్యోతినగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ.. ముందుగా వ్యాధిని గుర్తించేందుకు గళ్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే తదితర పరీక్షలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్లు షేకున్‌బాను, గాయత్రి, సూపర్‌వైజర్లు బాబురాజు, మనోరంజనిదేవి, జ్ఞానేశ్వరిదేవి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం ఐనేకల్ గ్రామానికి చెందిన రైతు రామచంద్ర పత్తి పంట ఎండిపోయిందని మనస్తాపానికి గురై సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామచంద్ర కుమారుడు ఉదయ్ తెలిపిన మేరకు వివరాలు.. ఆస్పరి మండలం ఐనేకల్ గ్రామానికి చెందిన రామచంద్ర కౌలుకు పది ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాడు. అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. పైరు ఎండిపోవడంతో ఉదయం పొలానికి మందు కొట్టడానికి వెళ్లి మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పక్క పొలం వారు సమాచారం ఇవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



ఇంతియాజ్‌అలీ ఎంఈఈ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీ.ఇంతియాజ్‌అలీ తెలిపారు. ఈనెల 10వ తేదీన ఎంఈఈగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దిగువ కాలువ నుంచి బసాపురం ఎస్ఎస్ ట్యాంకులోకి రా వాటర్‌ను పంపింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. చెరువును పూర్తిస్థాయిలో నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్ పరిశీలన

గోనెగండ్ల : మండల కేంద్రంలోని ఎస్ఎస్ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు సోమవారం పరిశీలించారు. ఎల్లెల్సీ కాలువ నుంచి ట్యాంకుకు నీటిని ఎలా పంపింగ్ చేస్తున్నారని, ప్రస్తుతం ట్యాంకులో ఎంత నీరు ఉంది తదితర విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం



మైక్ సెట్ అందజేస్తున్న నాగరాజు స్వామి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అర్ధగేరి బసవన్న గౌడ్ పురపాలక ప్రాథమిక పాఠశాలకు దాత నాగరాజు స్వామి మైక్ సెట్‌ను సోమవారం విరాళంగా అందించారు. హెచ్ఎం మల్లికార్జున మాట్లాడుతూ.. నాగరాజు స్వామి గత మూడు సంవత్సరాలుగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్లేట్స్, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి అందిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు పద్మావతమ్మ, వీరచంద్ర యాదవ్, గీత, ప్రమీలమ్మ, శ్రీనివాసులు, సీఆర్పీ బీచుపల్లి పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

మంత్రాలయం : కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపడుతున్నట్లు డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక హుండీ భవనంలో ప్రత్యేక నిఘా మధ్య హుండీ ఆదాయం కౌంటింగ్ ఉంటుందన్నారు. శ్రావణమాసం రెండో సోమవారం ముగియడంతో లెక్కింపు చేస్తున్నామన్నారు. ఉదయం 7 గంటల నుంచి హుండీ ఆదాయం, వివిధ కానుకల గణన చేస్తామని పేర్కొన్నారు.

ప'రేషన్' తప్పదా?

- ఎండీయూల తొలగింపు ఆలోచనలో ప్రభుత్వం
- మళ్లీ షాపుల వద్దకే వెళ్లి పడిగాపులు కాసే పరిస్థితి
- సరుకులు తెచ్చుకోవాలంటే తప్పని ప్రయాస
- ఆందోళనలో కార్డుదారులు

ప్రజలకు ఏది అవసరమో.. అనవసరమో పట్టించుకోకుండా ఏక'పచ్చ' ధోరణిలో సీఎం చంద్రబాబు నడుచుకుంటున్నారు. ఒక్కొక్క సేవను ప్రజలకు దూరం చేసే పనిలో పడ్డారు. తాజాగా కుయ్ కుయ్ అని సైరన్ మోగిస్తూ ఇంటి వద్దకే వచ్చి ఠంచన్‌గా నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను తొలగించే ఆలోచనకు దిగారు. దీంతో మళ్లీ రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాసే రోజులను తెస్తున్నారు. వాహనాలను నిలిపివేయాలన్న నిర్ణయాన్ని ప్రజలు సర్వత్రా వ్యతిరేకిస్తున్నారు.

ఆదోని టౌన్/ మంత్రాలయం/ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పేదలకు మంచి చేసిన ఒక్కొక్క పథకాన్ని కూటమి ప్రభుత్వం ఏదో సాకులు చేపుతు రద్దు చేయటానికి పూనుకుంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలు బియ్యం కోసం రేషన్‌షాప్‌ల దగ్గరకు పనులు వదలిపెట్టుకొని వెళ్లి గంటల తరబడి వేచి ఉండే ప్రాయసను తప్పించాలని భావించి ఇంటి దగ్గరకే రేషన్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజల మన్ననలు పొందారు. రేషన్ బియ్యంతోపాటు సరుకులు ఇంటింటికీ చేరవేయడానికి ఎండీయూ వాహనంతో పాటు ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అయితే ఇంటి వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేసే పద్ధతిని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని నిర్ణయం తీసుకోవడం సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. రేషన్ కోసం చౌక దుకాణానికి వెళ్లలేరా? అని, వాహనాలు, అందులో పనిచేసే వారికి చెల్లించే వేతనాల వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో గతంలో మాదిరిగా రేషన్‌షాపులకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలంటే నరకయాతన అనుభవించాల్సిందేనని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపుల దగ్గరకు వెళ్లి క్యూలైన్‌లో గంటల తరబడి నిల్చొని సరుకులను నెత్తిన పెట్టుకొని ఇళ్లకు చేరుకోవాలంటే ఎంతో కష్టం. ఇక వృద్ధులు, వికలాంగుల పరిస్థితి మరీ దయనీయం. రేషన్ కోసం ఇతరుల సాయం తీసుకోవాల్సి వస్తుంది. ఐదు సంవత్సరాలు ఇంకా ఏమేమి ఘన కార్యాలు చేస్తారో, ఉన్న పథకాలన్ని తొలగిస్తారేమోనని ప్రజలు అందోళన చెందుతున్నారు. బియ్యం వాహనాల తొలగింపుతో ఉపాధి పొందుతున్న యువత రోడ్డున పడినట్లు అయ్యింది.



గోనెగండ్లలో ఎండీయూ వాహనంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని నియోజకవర్గంలో 79 వేల రేషన్‌కార్డులు

ఆదోని నియోజకవర్గంలో 79 వేల రేషన్‌కార్డులు, 42 ఎండీయూ వాహనాలు ఉండగా 84 మంది ఉపాధి పొందుతున్నారు. ప్రతినెలా 164 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు రేషన్‌షాపుల్లో బియ్యం, చక్కెర, కంది పప్పు, అప్పడాలు తదితర వస్తువులను సరఫరా చేసేవారు. అయితే ప్రస్తుతం బియ్యం ఒక్కటే పంపిణీ చేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో...

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 165 రేషన్ దుకాణాలు, 92,148 కార్డుదారులు, 55 ఎండీయూ వాహనాలు, 110 మంది ఆపరేటర్లు, హెల్పర్లు ఉన్నారు. ఎమ్మిగనూరు టౌన్‌లో 44 రేషన్ దుకాణాలు, 25,935 మంది కార్డుదారులు ఉండగా 18 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. రూరల్‌లో 42 రేషన్ షాప్స్ ఉండగా 23,455 మంది కార్డుదారులకు 13 వాహనాలు సరుకులు పంపిణీ చేస్తున్నాయి. నందవరం మండలంలో 36 రేషన్ దుకాణాల్లో 19,189 మంది కార్డుదారులు, 11 వాహనాలు, గోనెగండ్ల మండలంలో 43 రేషన్ దుకాణాల్లో 23,759 మంది కార్డుదారులు ఉండగా 13 ఎండీయూ వాహనాలు ఉన్నాయి.

బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు

గోనెగండ్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ప్రజలను అందలమెక్కిస్తామని చెప్పి ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేశారు. చౌక దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమపిండి వస్తువులను సరఫరా చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చాక చౌకదుకాణాల ద్వారా సరుకుల పంపిణీలో అసలుకే ఎగనామం పెట్టారు. మండలంలో 43 చౌక దుకాణాలు ఉండగా 23,579 కార్డుదారులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారునికి 5కిలోల ఉచిత బియ్యం, కుటుంబానికి కిలో కందిపప్పు, అర కిలో చక్కెర, కిలో గోధుమపిండి, జొన్నలు, రాగులు, గోధుమలు ఇంటి దగ్గరకే వచ్చి మొబైల్ వాహనంలో సరఫరా చేసింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు నెలలుగా రేషన్ లబ్ధిదారులకు బియ్యంతో సరిపెడుతోంది. ఈనెల బియ్యంతో పాటు అరకొరగా జొన్నలు మాత్రమే సరఫరా చేసింది. రెండు నెలల నుంచి కందిపప్పు, చక్కెర, గోధుమపిండి ఇవ్వకుండా ఎగనామం పెడుతోంది. ఎన్నికలకు ముందు అంత ఇంత అని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఏమీలేకుండా చేస్తున్నారని ప్రజలు నిరాశ చెందుతున్నారు.

మంత్రాలయం నియోజకవర్గంలో 48 ఎండీయూ వాహనాలు

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 94 పంచాయతీలు, 80 సచివాలయాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 164 రేషన్‌షాపులు ఉండగా 84,868 కార్డు లబ్ధిదారులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి 48 వాహనాలను కేటాయించి ఇంటింటికీ రేషన్ అందజేసింది. మారుమూల పల్లెలకు, డీలర్‌షాపులు లేని గ్రామాలకు ఈ పథకం ఎంతగానో దోహద పడింది. అలాగే వాహనాలద్వారా 96 మంది ఉపాధి లభించింది. ఇప్పుడు ఈ వాహనాలు తొలగిస్తే పాత కష్టాలు దరి చేరుతాయని ప్రజలు వాపోతున్నారు.

మాలాంటి వారికి చాలా ఇబ్బంది



నేను మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఎక్కువ దూరం నడవలేను. నా కుమారులు వేర్పాటు పోయారు. నేను, నా భర్త తాయన్న ఇద్దరం ఇంటిలోనే ఉంటున్నాం. మాలాంటి వారు దూరంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బంది. గతంలో సీఎం జగన్ ట్రక్కుల ద్వారా ఇంటి వద్దకే వచ్చి బియ్యం అందించేవారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ట్రక్కులను తీసేస్తారని, రేషన్‌కార్డుదారులందరూ రేషన్ కేంద్రానికి వెళ్లి థంబు వేసి బియ్యం తెచ్చుకోవాలని చెబుతున్నారు.

– ఉరుకుందమ్మ, వృద్ధురాలు, పెద్దతుంబళం గ్రామం

ఇంటింటికీ రేషన్ విధానం బాగుంది



గత ప్రభుత్వ హాయంలో ఇంటి వద్దకే రేషన్ బియ్యం వేసే విధానం చాలా బాగుంది. ఎండీయూ ఆపరేటర్ వాహనంలో రేషన్ వేసుకుని కాలనీలో ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ రేషన్ బియ్యం అందించేవారు. ప్రస్తుతం రెండు నెలలుగా వాహనం కాలనీలోకి రావడం లేదు. ఇంటి వద్దనే కూర్చుని రేషన్ వేస్తున్నారు. ప్రజలు పనులు మానుకుని రేషన్ షాపు వద్ద పడిగాపులు కాచి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వచ్చింది. ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యం అందిస్తే బాగుండు.

– ఉసేని, సాతనూరు

పథకం రద్దు అన్యాయం



ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల సమావేశంలో చెప్పడం దురదృష్టకరం. ఇది పేదలకు తీవ్ర కష్టాలను తెచ్చిపెట్టినట్లవుతుంది. మొన్నటివరకు వైఎస్ జగన్ పాలనలో ఇంటింటికి రేషన్ పథకం కింద ట్రక్కుల ద్వారా సబ్సిడీ కింద బియ్యం, చక్కెర, కందిపప్పు తదితర వస్తువులను లబ్ధిదారులకు అందించేవారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం ఆ వసతులన్నింటినీ రద్దు చేయాలనుకోవడం బాధాకరం. రేషన్‌షాపులకు వెళ్లి నిత్యావసర వస్తువులను తెచ్చుకోవాలంటే ప్రజలు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పథకాన్ని కొనసాగించాలి.

– రమేష్ యాదవ్, ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి

కూలీ మానుకోవాల్సి వస్తుంది



గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ వేయడంతో ప్రయాసలు లేకుండా ఉండేవి. వాహనలను తీవేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రోజంతా పనులు మానేసి రేషన్ దుకాణాలతో నిరీక్షించాల్సి ఉంటుంది. మాలాంటి పేదలకు కూలికి పోతేనే రోజు గడస్తుంది. అలాంటిది రేషన్ బియ్యం కోసం కూలీ మానుకొని రోజు వృథా చేసుకోవాలంటే కష్టమవుతుంది.

– రాములమ్మ, నందవరం మండలం

రేషన్ షాపుకు వెళ్లాలంటే ఇబ్బందులు



రేషన్ బియ్యం కోసం చౌకదుకాణానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రేషన్ షాపులో బియ్యం కోసం పనులు మానుకొని గంటల తరబడి లైన్లో నిలబడి రేషన్ తీసుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులు ఇబ్బంది పడకుండా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసింది. దీంతో వృద్ధులకు, మహిళలకు, దివ్యాంగులకు ఎంతో మేలు జరిగింది. ఇంటింటికీ రేషన్ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా కొనసాగించాలి.

– బోయ రంగమ్మ, హెచ్. కైరవాడి గ్రామం

కొనసాగించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ పథకాన్ని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ అదనపు భారం అన్ని చెప్పి రద్దు చేయాలని చూడటం మంచి నిర్ణయం కాదు. రేషన్ షాప్ దగ్గర క్యూలైన్లో గంటల కొద్ది నిల్చొని నిత్యవసర సరుకులు తెచ్చుకోవడం ప్రజలు మరచిపోయేల ఇంటి వద్దకే సరుకులను గత ప్రభుత్వం అందించింది.

– దస్తగిరి, గువ్వలదొడ్డి, ఎమ్మిగనూరు మండలం

నిర్ణయం ఉపసంహరించుకోవాలి



డీలర్‌షాపుల నుంచి నిత్యావసర సరుకులను ట్రక్కుల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు తరలిస్తూ ఇంటి వద్దనే పంపిణీ చేయాలి. ట్రక్కులను రద్దు చేసి రేషన్‌షాపుల వద్దకు వెళ్లి సరుకులను తెచ్చుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు ఇక్కట్లే తప్పా ఉపయోగం లేదు. పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వ్యవహరించాలి.

– మారుతిరావు, ఆదోని

నిత్యావసర సరుకులు ఇవ్వాలి



గత ప్రభుత్వంలో లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు బాగా ఇచ్చారు. అయితే రెండు నెలలుగా కూటమి ప్రభుత్వంలో నిత్యావసర సరుకులు సరఫరా చేయలేదు. మా గ్రామంలో ఈనెల కూడా బండి దగ్గర బియ్యం మాత్రమే వేశారు. చక్కెర, కందిపప్పు, గోధుమపిండి ఇవ్వాలి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించాలి. దీని వలన వాహన డ్రైవర్లకు ఉపాధితో పాటు లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

– బోయ పద్మ, అలువాల గ్రామం

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, ఆర్డీఓ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, పక్కనే ఎమ్మెల్యే పార్థసారథి

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మిగనూరులో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘ జాతీయ మాజీ కార్యదర్శి

ఆదోని సెంట్రల్: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి అధ్యక్షతన ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు జెండాను అవిష్కరించారు సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, వీరేష్, విజయ్, ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, అంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్లలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు మునిస్వామి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. నందవరం : మండల కేంద్రం నందవరంలోని స్థానిక పాత ఇంటిగ్రేటెడ్ వసతి గృహం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆసంఘం మాజీ సీనియర్ నాయకులు నరసింహులు, రాజుల చేతుల మీదుగా జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం మాజీ నాయకులు భాస్కర్ యాదవ్, వీరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆదోని టౌన్: మండలంలోని మదిరె గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వడ్డే రాజు గ్రామంలో ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. పక్కనే ఎల్ఎల్‌సీ ప్రవహిస్తున్నా గ్రామంలో మాత్రం తాగునీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో ఈ నెల 8న విధులకు వెళ్తు రోడ్డు ప్రమాదాని గురై తీవ్రంగా గాయపడ్డ రూరల్ ఏఎస్ఐ బాలనాయక్‌కు రూరల్ సీఐ విక్రంసింహా, ఎస్ఐ శ్రీనివాసులు, బదిలీపై వెళ్లిన రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది కలిసి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం రూ.1,07,000లను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందించారు. ఏఎస్ఐ కుటుంబానికి అండగా నిలిచిన వారిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు సీఐ విక్రంసింహా తెలిపారు. ప్రస్తుతం గాయపడ్డ ఏఎస్ఐ హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు సీఐ చెప్పారు. పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు ఉన్నారు.



ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని ఇస్వీ గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జిపైన సోమవారం బస్సు–స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన లక్ష్మన్న, తలారి వెంకటేష్‌లు ఆదోనిలో పని ముగించుకుని బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వే బ్రిడ్జిపై ఉరుకుంద గ్రామం నుంచి వస్తున్న బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నాగలదిన్నెలో ఒకరికి..

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన అనిల్ గాయపడ్డాడు. అనిల్ తన భార్య స్వర్ణలతను చూడడానికి బైక్‌పై సంజీవపురం వెళ్లి వస్తుండగా సబ్ స్టేషన్ సమీపంలో ఎద్దుల బండి వెనుక చక్రాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అనిల్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసంతో పాటు ఆత్మస్థైర్యం కలిగి అడుగులు ముందుకు వేయాలని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ సూచించారు. విట్టా ఫౌండేషన్ అధ్యక్షులు విట్టా సతీష్ ఆధ్వర్యంలో విట్టా క్రిష్టప్ప, సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస రెండవ దశ శిక్షణ సోమవారం ముగిసింది. కళాశాల కరస్పాండెంట్ దైదదీనం రెడ్డి, మాజీ కరస్పాండెంట్లు శ్రీనివాస రెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి భోజన సదుపాయం

ఎమ్మిగనూరుటౌన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఉరుకుంద పుణ్యక్షేత్రానికి స్థానిక డిపోతో పాటు ఇతర డిపోల బస్సులను నడుపుతుండటంతో డ్రైవర్లు, కండెక్టర్లకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించినట్లు డిపో మేనేజర్ అమర్నాథ్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుడ్రైవర్లు, కండెక్టర్లకు భోజన ప్యాకెట్లను అందజేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరాలదొడ్డి గ్రామ క్రాస్ రోడ్డు దగ్గర తనిఖీలు చేస్తుండగా కారులో 32 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కారులో ఉన్న టీఎస్ కూళ్లూరు జంగం మల్లికార్జున, బోయ రంగస్వామి, బోయ లక్ష్మన్న, గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడుకు చెందిన పశువుల మల్లికార్జునను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరు నలుగురు ముఠాగా ఏర్పడి మద్యాన్ని పెద్దమర్రివీడు నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో బయటపడిందన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 3 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు రబ్బానీ, లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

ఆదోని రూరల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీపీ బడాయి దానమ్మ, డీఎల్పీఓ నూర్జహాన్ పాల్గొన్నారు.

హారతి తట్టపై రగడ

- ఆలయ పూజారికి నోటీసు జారీ

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో తట్టా రాజకీయం నడుస్తున్న విషయం విధితమే. ఈ అంశాన్ని సాక్షి 'ఉరుకుందలో తట్టా రాజకీయం' శీర్షికతో వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో సోమవారం హారతి తట్టాపై రగడ చోటు చేసుకుంది. తట్టాను పట్టొద్దని.. కానుకలు ముట్టరాదని.. ఉరుకుంద గ్రామ నాయకులు పట్టుబడుతున్నారు. చెవిన వేసుకోకుండా సోమవారం అర్చకులు అలాగే తట్టా విధానాన్ని కొనసాగించారు. దీంతో కోపగించిన గ్రామ నాయకులు ఆలయంలో అర్చకుల తట్టాలో ఉన్న నగదును తీసుకుని హుండీలో వేశారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. తట్టా వ్యవహారం ఆలయ డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన డీసీ శివన్న అనే పూజారికి నోటీసు జారీ చేశారు. ఇతర పూజార్లు కూడా తట్టా జోలికి వెళ్లకూడదని సూచించారు. చిలికి చిలికి ఈ తట్టా తంటా ఎంత వరకు దారి తీస్తుందోనని ఆలయ అధికారులు ఆందోళన చెందుతున్నారు.



ఈరన్న సన్నిధానంలో తట్టాతో హారతి పడుతున్న అర్చకులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోని టౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించుందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 10 మంది ప్రజలు సమస్యలను వివరిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు.

ఆర్టీసీ కాలనీలో పర్యటన

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కపర్తినగర్, ఆర్టీసీ కాలనీలో కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఈ, ఏఈలు, సచివాలయం ఉద్యోగులు పర్యటించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి ముందు తొట్టిల్లో ఉన్న మురుగునీటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేసి శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. టీపీఓ శ్రీనివాసులు, అధికారులు ఉన్నారు.



కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న ప్రజలు

బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరురూరల్: ఎంపీడీఓగా బంగారమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కొండన్న బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు.

గోనెగండ్ల : ఎంపీడీఓగా ఎంజీ. ప్రవీణ్ కుమార్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సోనిబాయి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నందవరం : మండల ఎంపీడీఓగా దశరథ రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అనంతపురం బదిలీ అయ్యారు.